# అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కుర్తివాడలో ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

- మన ఊరు - మనబడితో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 3: అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నదని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుర్తివాడ, కొత్తపల్లి గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్తివాడలోని ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ, పశువైద్యశాల భవనాలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నదన్నారు. రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.5000 చొప్పున పెటుబడి సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఆడపిల్లల పెండ్లి ఖర్చులకు ఇబ్బంది కలుగకుండా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. మనఊరు- మనబడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సొంతంగా జాగా కలిగి, ఇండ్లు లేని నిరు పేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షలు అందిస్తున్నదన్నారు. వీటితో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నట్లు వివరించారు. కుర్తివాడలో పాఠశాల భవనాన్ని ప్రారంభించిన అనంతరం నూతనంగా మనఊరు- మనబడి కింద ప్రభుత్వం అందజేసిన ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా విద్యా బోధన ఎలా జరుగుతున్నదని విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో కొద్దిసేపు పాటకనుగుణంగా స్టెప్పులు వేశారు. ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులు ఎలా చదువుతున్నారని, పెద్దయ్యాక ఏం చేయాలనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పోలీస్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కుమ్మరి జగన్, సర్పంచ్‌లు స్రవంతి శ్రీనివాస్, మర్రి లింగారెడ్డి, సంగప్ప, వెంకటరాములు, నరసింహగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు కుభేరుడు, కుర్తివాడ విద్యా కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ మంజుల, ఎంపీడీవో జగదీశ్వర్‌చారి, మండల విద్యాధికారి నీలకంఠం, ఉన్నత పాఠశాల హెచ్ఎం అంజాగౌడ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి: ఎస్పీ



ఫిర్యాదు తీసుకుంటున్న ఎస్పీ రోహిణిప్రియదర్శిని

మెదక్ అర్బన్, జూలై 3: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. తమ గ్రామానికి చెందిన పాలివాళ్లపై చేను వద్ద జరిగిన గొడవలతో వారిపై మూడు కేసులు నమోదయ్యాయని, అప్పటి నుంచి తమపై కక్ష గట్టి తన కుటుంబాన్ని చంపడానికి ప్రయత్నిస్తున్నారని పెద్దశంకరంపేట్ మండలం శివాయపల్లి గ్రామానికి చెందిన దండు భూదమ్మ ఫిర్యాదు చేశారు. ఇలా పలుమార్లు తమపైకి గొడ్డళ్లు, కర్రలతో దాడి చేయడానికి పొలాల వద్ద వేచి చూస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. అర్జీదారుకు చట్టప్రకారం తగిన న్యాయం చేయాలని పెద్దశంకరంపేట్ ఎస్సైకి సూచించారు.

# ఐఐటీహెచ్‌లో ఓపెన్ టు ఆల్ టీచింగ్

సంగారెడ్డి జూలై 3(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ సరికొత్త నిర్ణయం తీసుకున్నది. దేశంలోనే మొట్టమొదటి సారిగా ఓపెన్ టు ఆల్ టీచింగ్‌ను ప్రారంభించనున్నది. ఐఐటీ వెలుపలి కళాశాల విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, అధ్యాపకుల కోసం ఐఐటీహెచ్ రియల్ టైం టీచింగ్‌కు అవకాశం కల్పిస్తున్నది. ఐఐటీ తరగతి గదుల్లో ప్రొఫెసర్లు బోధించే పాఠాలను రియల్ టైంలో బయటి కళాశాల విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, అధ్యాపకులు వినవచ్చు. తద్వారా తమ అకడమిక్ స్కిల్క్‌ను పెంపొందించుకునే అవకాశం లభిస్తుంది. ఇందులో భాగంగా 12 కోర్సులను ఐఐటీ హైదరాబాద్ ఆఫర్ చేస్తున్నది. ఓపెన్ టు ఆల్ టీచింగ్‌లో చేరి కోర్సులను పూర్తి చేసిన వారికి హైదరాబాద్ ఈ-సర్టిఫికెట్‌ను అందజేయనున్నది.

**ప్రత్యక్ష తరగతుల్లో పాల్గొనవచ్చు**

ఐఐటీహెచ్‌లో బీటెక్, ఎంటెక్‌లో 19 రకాల కోర్సులను అందజేస్తోంది. ఇక్కడ 4200 మంది విద్యార్థులు ఉండగా, 300 మందికిపైగా ప్రొఫెసర్లు బోధిస్తారు. ఐఐటీ హైదరాబాద్‌లో ప్రొఫెసర్లు బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు బోధించే పాఠాలను తామూ విని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఐఐటీల్లో చేరని కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు, సాంకేతిక నిపుణులకు ఉంటుంది. ఐఐటీల్లో బోధించే పాఠాలను ప్రత్యక్షంగా వినే అవకాశం దేశంలో ఏ ఐఐటీ ఇవ్వటంలేదు. దేశంలోనే మొట్టమొదటి సారిగా ఐఐటీ హైదరాబాద్ ఓపెన్ టు ఆల్ టీచింగ్ పద్ధతిలో ఇక్కడ బోధించే పాఠాలను రియల్ టైమ్‌లో వినే అవకాశం కల్పిస్తున్నది. అంతేకాదు ఓపెన్ టు ఆల్ టీచింగ్‌లో చేరే విద్యార్థులు తమకు ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా ఆన్‌లైన్‌లో ఐఐటీ ప్రొఫెసర్లను అడిగి నివృత్తి చేసుకోవచ్చు. 2023 సంవత్సరానికి సెమిస్టర్ల వారీగా 12 కోర్సుల్లో పాఠాలు వినేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఇందులో ప్రధానంగా బయోటెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్, బయోమెడికల్, ఎలక్ట్రికల్, మెటలర్జీ, డిజైన్ మెటీరియల్స్ తదితర కోర్సులకు సంబంధించి రియల్ టైమ్ పాఠాలు వినవచ్చు. ఇందుకోసం అభ్యర్థులు ఈనెల 14 వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఒక్కో అభ్యర్థి ఒక్కో క్రెడిట్‌కు జీఎస్టీతో సహా రూ.10వేల రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఎంచుకున్న కోర్సును అనుసరించి ఒక్కో క్రెడిట్‌లో 10గంటల నుంచి 36 గంటల వరకు బోధన ఉంటుంది. ఓపెన్ టు ఆల్ టీచింగ్‌లో చేరాలనుకునే అభ్యర్థులు https://cce.iithac.in/open-to-all-teaching/ వెబ్‌సైట్‌లో తమ పేరును రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంటుంది.




## చెప్పుకోండి


1. 'పింక్ సిటీ'గా పేరుగాంచిన నగరం ఏది?
2. తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం ఎక్కడ ఉన్నది?
3. కిరణజన్య సంయోగక్రియలో వెలువడే వాయువు ఏది?



## పెద్దల మాట

**ఆశయాలను** ఆచరణలో పెడితే.. మహనీయులవుతారు.

● డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్



## పదసృష్టి



కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

machine

Ex : man

## కథ

# విచక్షణతోనే విలువ



సింహపురి రాజ్యాన్ని శ్రీవర్ధనుడు పరిపాలించేవాడు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా తన పరిపాలన ఉండేది. మంత్రి రామశర్మ చక్కని సలహాలు ఇస్తున్నా.. తనకు నచ్చినట్లే పాలించేవాడు మహారాజు. అలా ఆలోచన లేకుండా నిర్ణయాలు తీసుకోకూడదని మంత్రి ఎంత చెప్పినా వినేవాడు కాదు. వేగుల ద్వారా పక్కరాజ్యమైన విక్రమపురి పరిపాలన గురించి తెలుసుకునేవాడు. ఒకసారి వేగులు.. ''రాజా! అక్కడ ప్రతి ఇంట్లో విక్రమపురి రాజుగారి చిత్రపటం ఉంది. రాజుగారి పరిపాలనకు ప్రజలు జేజేలు పలుకుతుంటారు'' అని చెప్పారు. అది విన్న శ్రీవర్ధనుడు, వెంటనే మంత్రి రామశర్మను పిలిపించి.. ''మంత్రివర్యా! నా చిత్రపటాలు గీయించి రాజ్యంలో ప్రతి ఇంటికీ అందజేయండి. ప్రతి ఇంట్లో నా చిత్రపటం ఉండాలి. ఇది నా ఆజ్ఞ!'' అని చెప్పాడు. మహారాజు మాటకు ఎదురు చెప్పలేక.. ''అలాగే మహారాజా!'' అన్నాడు మంత్రి. ఆస్థానంలోని చిత్రకారులను పిలిపించి రాజు చిత్రాలను గీయించారు. రాజ్యంలోని ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. మహారాజుకు విషయం తెలియజేశారు. దాంతో ఆయన చాలా ఆనందించాడు. కొన్నిరోజుల తర్వాత వచ్చిన వేగులతో.. ''మన రాజ్యంలోని ప్రతి ఇంటా నా చిత్రపటం ఉంది కదా!'' అని అడిగారు. అప్పుడు వేగులు.. ''మహారాజా! ఇప్పుడు మన రాజ్యంలోని ఏ ఇంట్లోనూ మీ చిత్రపటాలు కనిపించడం లేదు'' అని చెప్పారు. దాంతో శ్రీవర్ధనుడికి కోపం వచ్చింది. మంత్రిని పిలిపించి చిర్రుబుర్రు లాడాడు. ఆయన కాస్త శాంతించిన తర్వాత.. ''మహారాజా! విక్రమపురి రాజ్యంలో రాజుగారి నిర్ణయాలు ప్రజలకు నచ్చి, రాజుగారి చిత్రపటాన్ని వారే చిత్రకారులతో వేయించుకొని తమ ఇంట్లో పెట్టుకున్నారు. అంటే పాలకుడు తీసుకునే నిర్ణయాలు ప్రజల హృదయాలలో నిలిచిపోవాలి. అప్పుడే ప్రతి ఇంట్లో కొలువై ఉంటాడు. మన రాజ్యంలో మాత్రం.. ప్రజలకు ఇష్టం ఉన్నా లేకపోయినా మీ ఆజ్ఞతో తీసుకున్నారు. కొన్ని రోజులు ఉంచుకున్నారు. తర్వాత పడేశారు. మీ నిర్ణయాలు వారికి రుచించకపోవడం వల్లే, మీపట్ల వాళ్లకు సానుకూల దృక్పథం లేదు. ప్రజల మనసులు గెలిచిన వాడే, వారి మనసులలో కొలువై ఉంటాడు. అందుకే, మంచి నిర్ణయాలు తీసుకొని పాలన చేస్తే, ప్రజలే మిమ్మల్ని దేవుడిగా కొలుస్తారు. ప్రజా సంక్షేమమే రాజుకు జయం!'' అని వివరించాడు మంత్రి. ఆ మాటలతో శ్రీవర్ధన మహారాజు ఆలోచనలోపడ్డాడు. 'నిజమే! ఇన్నాళ్లూ నేను అనుకున్నదే జరగాలని భావించాను. ఏదైనా నిర్ణయం తీసుకునేముందు.. మంచి చెడు విచక్షణ ఉండాలి' అనుకున్నాడు. అప్పటినుంచి ప్రజారంజకంగా పరిపాలించ సాగాడు. ప్రజలు కూడా తమ రాజుగారిని మనసులలో నిలుపుకొన్నారు.

● మొర్రి గోపి

## టంగ్ ట్విస్టర్స్

How can a clam cram in a clean cream can?



## జవాబులు

చెప్పుకోండి : 1. జైపూర్, 2. ములుగు (సిద్దిపేట జిల్లా), 3. ఆక్సిజన్
పూరించండి : van, egg


## చిట్టి హ్యాండ్స్

పి. మనస్విని, నల్గొండ.






## పూరించండి




బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి

## జతచేయండి

కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com